సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



నాణ్యమైన కాఫీ ఉత్పత్తి లక్ష్యం

గిరిజన రైతులు నాణ్యమైన కాఫీ ఉత్పత్తులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. 8లో



ఎట్టకేలకు కందిపప్పు పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు తెల్లరేషన్‌కార్డుదారులకు ఈనెల నుంచి రాయితీపై కంది పప్పును అందుబాటులోకి తెచ్చింది. 8లో



అభివృద్ధి పనులపై నివేదిక

అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నివేదికలు సమర్పించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం ఆదేశించారు. 8లో

కొద్దిరోజుల క్రితం బూదరాళ్ల పంచాయతీ గొర్రెలమెట్టకు చెందిన సీదరి మల్లేశ్వరరావు అనారోగ్యంతో కేజీహెచ్‌లో మృతి చెందాడు. అతని మృతదేహాన్ని గరికబంద వరకు ప్రజాప్రస్థానం వాహనంలో తీసుకువచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం లేకపోవడంతో డ్రైవర్ వాహనాన్ని అక్కడే నిలిపివేశారు. అక్కడి నుంచి మృతదేహాన్ని డోలీలో తరలించారు. గత నెలలో కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒక యువకుడు మృతి చెందాడు. అతని మృతదేహాన్ని స్వగ్రామం తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో లేదు. దూరప్రాంతాల నుంచి అంబులెన్స్‌ను రప్పించేందుకు ఎక్కువ సమయం పడుతుంది. అందువల్ల అతని మృతదేహాన్ని బైక్‌పైనే స్వగ్రామానికి తీసుకువెళ్లారు. ఇలాంటి ఘటనలు మన్యంలో ఏదో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో మృతదేహాలను తరలించేందుకు కుటుంబ సభ్యులు నరకయాతన అనుభవిస్తున్నారు.

మూటకట్టి మోయాల్సిందే

రహదారులు లేక మృతదేహాల తరలింపునకు నానా అవస్థలు

- వర్షాలు కురిస్తే అడుగు పెట్టలేని పరిస్థితి
- బురదలో కూరుకుపోతున్న వాహనాలు
- మిషన్ కనెక్ట్ పాడేరులో కొన్ని గ్రామాలకు మాత్రమే రవాణా సౌకర్యం



గొర్రెలమెట్టకు మృతదేహాన్ని డోలీలో మోసుకువెళ్తున్న గిరిజనులు (ఫైల్)

కొయ్యూరు: గిరిజన ప్రాంతం ప్రత్యేక జిల్లాగా ఏర్పాటైనా వందలాది గ్రామాలకు ఇప్పటికీ రహదారి సౌకర్యం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మిషన్ కనెక్ట్ పాడేరులో కార్యక్రమంలో మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు రూపకల్పన చేసింది. పాడేరు డివిజన్ పరిధిలో 11 మండలాల్లో 244 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 3,803 శివారు గ్రామాలు ఉన్నాయి. మిషన్ కనెక్ట్ పాడేరులో భాగంగా తొలి విడతలో 696 గ్రామాలకు 1180 కిలోమీటర్ల పొడవునా 764 మట్టిరోడ్ల నిర్మించారు. ఇందుకుగాను ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేశారు. ఈ పథకంలో 354.07 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు రూ.వంద కోట్లతో నిర్మాణాలు చేపట్టింది. ఇలా జరుగుతున్న తరుణంలో ప్రభుత్వం మారడంతో దీని ప్రభావం మట్టిరోడ్ల నిర్మాణంపై చూపింది.



బైక్‌పై మృతదేహాన్ని తరలిస్తున్న బంధువులు(ఫైల్)

వేగవంతం చేయాలి

పాడేరు డివిజన్ పరిధిలో భారీ సంఖ్యలో గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించాల్సి ఉంది. 'మిషన్ కనెక్ట్ పాడేరు' పనులు వేగవంతం చేయాలని అయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

- మొత్తం 3,803 గ్రామాలు ఉండగా వీటిలో 972 గ్రామాల గిరిజనులు డోలీపై ఆధారపడ్డారు.

ఆయా గ్రామాల్లో అనారోగ్యానికి గురైతే వారిని రోడ్డు ప్రాంతానికి కిలోమీటర్ల పొడవునా డోలీలో మోసుకుని తీసుకువెళ్లాలిన వస్తోంది. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందితే వారిని స్వగ్రామాలకు తరలించేందుకు నరకం చూస్తున్నారు. మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు అధికారులు వాహనాలు సమకూరుస్తున్నా రహదారి లేని కారణంగా గ్రామాల్లోకి వెళ్లలేకపోతున్నాయి. అక్కడినుంచి వాటిని తరలించేందుకు కుటుంబ సభ్యులు నానా అవస్థలు పడుతున్నారు.

- మృతదేహాలను తీసుకువెళ్లేందుకు కొన్ని సందర్భాల్లో ప్రభుత్వ ఆస్పత్రుల అంబులెన్సులు అందుబాటులో ఉండటం లేదు. దీనివల్ల కూడా గిరిజనులు సమస్యలు ఎదుర్కొంటున్నారు.ఇటీవల రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తిని బూదరాళ్ల పంచాయతీలోని స్వగ్రామానికి తరలించేందుకు అష్టకష్టాలు పడ్డారు. స్థానికంగా అంబులెన్సులు లేకపోవడంతో ఇక్కడి వైద్యులు కృష్ణదేవిపేట/కంఠారం పీహెచ్‌సీలకు ఫోన్ చేశారు. ఆ సమయంలో అంబులెన్సులు అందుబాటులో లేవు. దీంతో మృతదేహాన్ని బైక్‌పై తరలించాల్సి వచ్చింది.

ప్రత్యేక వాహనం సమకూర్చాలి

రహదారి సౌకర్యం లేని గ్రామాలకు మృతదేహాలను తరలించేందుకు ప్రత్యేక వాహనం అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని గిరిజనులు కోరుతున్నారు. కనీసం మూడు మండలాలకు ఒక వాహనం సమకూర్చినా తమ కష్టాలు కొంతవరకు గట్టెక్కుతాయని వారు పేర్కొంటున్నారు.

అందుబాటులోకి కొత్త అంబులెన్సులు

సీఎఫ్‌ఆర్ నిధుల ద్వారా కొత్తగా ఏడు అంబులెన్స్‌లు ఇచ్చేందుకు భారతీయ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ) ముందుకు వచ్చింది. పాడేరు ఐటీడీఏ పది వాహనాలను అడిగితే ఏడింటిని ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. వీటిలో రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి ఒకదానికి కేటాయిస్తామని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. మృతదేహాల తరలింపునకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

పాడేరు డివిజన్ సమాచారం

పంచాయతీలు	:	244
గ్రామాలు	:	3,803
డోలీపై ఆధారపడినవి	:	972
మిషన్ కనెక్ట్ పాడేరు	:	696 గ్రామాలు
నిర్మించిన రహదారులు	:	764
పెండింగ్‌లో ఉన్నవి	:	1133
కేటాయించిన ఉపాధి నిధులు	:	రూ.354.07 కోట్లు
ఇప్పటివరకు ఖర్చు	:	సుమారు రూ.100 కోట్లు

ఇబ్బందులు లేకుండా చర్యలు



రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా అత్యవసరమైతే అంబులెన్సులు లేనిచోటకు మరో పీహెచ్‌సీ నుంచి అంబులెన్సులను పంపిస్తున్నాం. త్వరలో అంబులెన్సుల కొరత తీరనుంది. ఇందుకు అవసరమైన చర్యలు కలెక్టర్ దినేష్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ చర్యలు తీసుకుంటున్నారు.

– డాక్టర్ జమాల్‌బాషా, డీఎంహెచ్‌వో, పాడేరు

అన్ని గ్రామాలకు రోడ్లు



పాడేరు డివిజన్‌లో 2021 నాటికి 1732 గ్రామాలకు రహదారులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో 764 రోడ్లు నిర్మించాం. పెండింగ్‌లో ఉన్న మిగతా 1133 రోడ్లను మూడేళ్లలో పూర్తిచేసి, డోలిమోత లేని గ్రామాలు లేకుండా ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం.

– వి. అభిషేక్, ఐటీడీఏ పీవో

న్యూస్‌రీల్

మాచ్‌ఖండ్ జల విద్యుత్ ఉత్పత్తిపై సమీక్ష



మాచ్‌ఖండ్ ప్రాజెక్టు అధికారులతో చర్చిస్తున్న ఒడిశా జలవిద్యుత్‌శాఖ అధికారులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని గురువారం ఒడిశాకు చెందిన విద్యుత్ అధికారుల బృందం సందర్శించింది. భారీ వర్షాలకు విద్యుత్ కేంద్రంలో నీరు చేరి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంపై బృందం ఆరా తీసింది. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి వివరాలను తెలుసుకుంది. అనంతరం ఒడిశా జలవిద్యుత్ కార్పొరేషన్‌కు చెందిన డైరెక్టర్ ఆపరేషన్ ఆశిష్‌కుమార్ మహంతి, గ్రిడ్కో డైరెక్టర్ ఉమాకాంత్ సాహూ,ఒడిశా రాష్ట్రంలో డిస్పేస్ సెంటర్ డైరెక్టర్ బీబీ మెహతాలు ప్రాజెక్టు అధికారులతో సమీక్షించారు. వరదనీరు చేరడానికి గల కారణాలు, ప్రస్తుత ప్రాజెక్టు పరిస్థితిపై చర్చించారు. విద్యుత్ ఉత్పత్తి అనంతరం ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలకు చేరవేసే ఫీడర్లు స్థితిగతులు, వాటి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వరావు, ఈఈ జనరేషన్ గోవిందరాజులు, ఈఈ సివిల్ ఖురేష్‌ప్రాదన్, ఏడీఈలు సత్యకిరణ్, రాజ్ కుమార్, బ్రజాసుందర్, చిరంజీవి పాల్గొన్నారు.

పొగమంచు అందాలు కనువిందు



పాడేరు-జి.మాడుగుల రోడ్డులో కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: గత మూడు రోజుల నుంచి మన్యంలో దట్టంగా మంచు కురుస్తోంది. అర్ధరాత్రి నుంచి ఉదయం 8గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు.శీతాకాలాన్ని తలపించేలా రోజు మంచు కురుస్తుండడంతో నెలకొన్న ఆహ్లాదకర వాతావరణాన్ని ప్రకృతి ప్రేమికులు ఆస్వాదిస్తున్నారు. దట్టంగా పొగమంచు కురుస్తుండడంతో వాహనాల హెడ్ లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తున్నారు.

పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో జిల్లా ప్రథమస్థానం

- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: సామాజిక పింఛన్ల పంపిణీలో జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1,24,778 మంది పింఛన్‌దారులకుగాను 1,24,190 మందికి నగదు పంపిణీ చేసి, 99.53 శాతంతో ప్రథమ స్థానం సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందుకు కృషి చేసిన డీఆర్‌డీఏ పీడీ మురళి, ఎంపీడీవోలు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

650 టన్నుల కాఫీ గింజల కొనుగోలు లక్ష్యం

జీసీసీ చింతపల్లి డివిజనల్ మేనేజర్ దేవరాజ్



చింతపల్లి: స్థానిక గిరిజన సహకార సంస్థ డివిజన్ పరిధిలో 650 టన్నుల కాఫీ గింజల కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించామని డివిజనల్ మేనేజర్ పి. దేవరాజు తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది కాఫీ దిగుబడులు తగ్గిన కారణంగా 160 టన్నులు కాఫీ మాత్రమే కొనుగోలు చేశామన్నారు. ఈఏడాది గిరిజన కాఫీ రైతులు నుంచి 650 టన్నుల వరకు కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. గత ఏడాది పాచిమెట్ రూ.250, చెర్రీ రూ.145 రభస రకం రూ.70 చొప్పున గరిష్ట ధరలకు కొనుగోలు చేశామన్నారు. రైతులు సైతం నాణ్యమైన కాఫీని సేకరించి మంచి ధర పొందేలా కృషి చేయాలని సూచించారు. కాఫీలో పాచ్‌మెంట్ 10శాతం, చెర్రీ 10.5 శాతం తేమ కలిగి ఉండాలన్నారు. దీనిపై కాఫీ రైతులకు నాణ్యమైన కాఫీ దిగుబడులు సాధించేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. గిరిజన రైతాంగం తొందరపడి దళారులకు నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం అందించే మంచి ధరలకు విక్రయించాలని ఆయన కోరారు.

టెట్ పరీక్ష కేంద్రం పరిశీలన

మహారాణిపేట(విశాఖ): జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) కేంద్రాన్ని గురువారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సందర్శించారు. ఈ పరీక్ష కోసం జిల్లాలో మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ అక్కడ ఏమైనా లోటు పాట్లు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల జరుగుతున్న తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో డీఈవో చంద్రకళ ఉన్నారు.



పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రతిబింబించిన ఆదివాసీ సంస్కృతి

రాష్ట్రస్థాయి ఏకలవ్య పాఠశాలల సాంస్కృతిక సంబరం గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించింది. సంప్రదాయ గిరిజన పాటలు, దేశభక్తి గీతాలు, సాంస్కృతిక నృత్య రూపకాలతో అలరించింది. ఆధునిక కళలకు పునాది ఆదివాసీ సంస్కృతి, కళలేనని ప్రదర్శనల ద్వారా విద్యార్థులు చాటిచెప్పారు. ఆదివాసీ జీవనవిధానం అత్యంత పురాతనమని, ప్రకృతి, శ్రమతో మిళితమైన ఆదివాసీలు.. వారి కళలు, సాహిత్యమిళితమని వారు తెలియజేశారు. డప్పు, తుడుం వాయిద్యాలతో ఆకట్టుకున్నారు.



ఏకలవ్య పాఠశాలల విద్యార్థుల డప్పు వాయిద్యాలు



తుడుం కొడుతూ ఉత్సాహ పరుస్తున్న ఏకలవ్య విద్యార్థులు

- ప్రదర్శనలతో చాటిచెప్పిన ఏకలవ్య విద్యార్థులు
- ఘనంగా రాష్ట్రస్థాయి కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలల్లోనూ కల్చరల్ ఫెస్ట్: కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు సత్కారం

అరకులోయ టౌన్: అరకులోయలో రాష్ట్రస్థాయి ఏకలవ్య పాఠశాలల కల్చరల్ ఫెస్ట్ (సాంస్కృతిక సంబరం) గురువారం ఉత్సాహ పూరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభమైంది. ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ భాస్కరరావు అధ్యక్షతన అరకులోని యండపల్లివలస గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. ఈ కల్చరల్ ఫెస్ట్‌ను ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాష్ట్రంలోని 28 ఏకలవ్య పాఠశాలలు చెందిన సుమారు 800 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన వారు జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలల్లో కూడా ఇటువంటి కల్చరల్ ఫెస్ట్ నిర్వహిస్తామన్నారు. ఇటువంటి సాంస్కృతిక పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభకు పదును పెట్టినట్టు అవుతుందన్నారు.

ఉత్తమ భవిష్యత్ లక్ష్యం కావాలి:

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

గిరిజన విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్ అందించే లక్ష్యంతోనే ఏకలవ్య క్రీడా పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటుచేసిందని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ఈ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్ బోధించి విద్యార్థులు భవిష్యత్తులో నీట్, జేఈఈ, సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఒకొక్క విద్యార్థికి ఏడాదికి రూ.1.09 లక్షలు ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రెండో సారి ఇక్కడే నిర్వహణ అభినందనీయం:

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయలో రెండో సారి కల్చరల్ ఫెస్ట్ నిర్వహించడం అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని గిరిజన ఆచార, వ్యవహారాలు, సాంస్కృతిక సంప్రదాయాలు తెలుసుకునే వీలుంటుందన్నారు. సీబీఎస్ఈ సిలబస్ బోధన వల్ల గిరి విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించే అవకాశం కలిగిందన్నారు.ఉపాధ్యాయులపై విద్యార్థులకు గౌరవం పెరగాలన్నారు.

పూర్తిస్థాయి సౌకర్యాలు:

గురుకులాల జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి

రాష్ట్రంలోని ఏకలవ్య పాఠశాలల్లో పూర్తిస్థాయి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని గురుకులాల జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి తెలిపారు. ఇప్పటి వరకు 12 ఏకలవ్య పాఠశాలలకు శాశ్వత భవనాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. డిసెంబర్ నాటికి మిగిలిన పాఠశాలలకు శాశ్వత భవన నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. రాష్ట్రంలోని ఏకలవ్య పాఠశాలలో 550 పోస్టులు భర్తీ అయినట్టు చెప్పారు. మిగిలిన 45 పోస్టులు 15 రోజుల్లో భర్తీ అవుతాయన్నారు. జెడ్పీటీసీ శెట్టి రోషిణి మాట్లాడారు. కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటుచేసిన నృత్య ప్రదర్శనల పోటీలను ముఖ్య అతిథులు, కలెక్టర్ దినేష్‌కుమార్ తిలకించారు. పాఠశాల సిబ్బంది అతిథులకు శాలువాలు కప్పి సత్కరించింది. గురుకులం కన్వీనర్ మూర్తి, సర్పంచ్‌లు పెట్టెలి సుస్మిత, దాసుబాబు, ఎంపీటీసీలు ముక్త, ఆనంద రావు, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, రాష్ట్రంలోని ఏకలవ్య పాఠశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలను తిలకిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్ తదితర జిల్లా అధికారులు



కల్చరల్ ఫెస్ట్‌ను తిలకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు

దుర్గమ్మా.. కరుణించు



పాడేరులో ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మతల్లి

సాక్షి,పాడేరు: దుర్గాదేవి శరన్నవరాత్రులు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రమైన పాడేరులోని కనకదుర్గ, రాజరాజేశ్వరి విగ్రహాలను బాలత్రిపురసుందరి దేవిగా అర్చకులు అలంకరించి తొలిరోజు పూజలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కనకదుర్గమ్మతల్లి ఆలయంలో దశమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలోని రాజరాజేశ్వరి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ కమిటీ భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేసింది. ఇరడాపల్లి, కొత్తపాడేరు, చింతలవీధి, వంతాడపల్లిలోని కనకదుర్గమ్మ ఆలయాలు, అరకులోయ పట్టణంలోని మల్లికార్జున సమేత భ్రమరాంబదేవి ఆలయంలోను శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు.



అరకులో బాలత్రిపురసుందరి అలంకరణలో భ్రమరాంబదేవి



పాడేరులో బాలత్రిపురసుందరి అలంకరణలో కనకదుర్గమ్మ



పాడేరులోని రాజరాజేశ్వరిదేవి విగ్రహానికి పూజలు

క్లుప్తంగా

నాణ్యమైన కాఫీ ఉత్పత్తి లక్ష్యం

- సాగుకు అన్ని విధాలా ప్రోత్సాహం
- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో గిరిజన రైతులంతా నాణ్యమైన కాఫీ ఉత్పత్తులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ కాఫీ దినోత్సవం పురస్కరించుకుని మినుములూరు కేంద్ర కాఫీబోర్డు క్షేత్రంలో గురువారం గిరిజన రైతులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి ఉందన్నారు. అరకు కాఫీకి ప్రపంచ దేశాలలో మంచి ఆదరణ ఉందన్నారు. కాఫీ సాగు,నాణ్యమైన కాఫీ గింజల ఉత్పత్తి,గిట్టుబాటు ధరలు కల్పన,మార్కెటింగ్‌కు అన్ని విధాల సహకరిస్తామన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో పాటు ఎన్‌జీవోలు, ఐటీడీఏ,కేంద్ర కాఫీబోర్డు,హార్టికల్చర్ అధికారులంతా నాణ్యమైన కాఫీ ఉత్పత్తులకు చర్యలు తీసుకోవాలన్నారు.అనంతరం కాఫీ స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్, కాఫీబోర్డు సభ్యులు కురుసా ఉమామహేశ్వరరావు,విశ్వనాథ్, కాఫీబోర్డు డీడీ రమేష్ పాల్గొన్నారు.

వాహనాల వెలికితీత


కొట్టుకుపోయిన వాహనం, సామగ్రిని వెలికితీస్తున్న దృశ్యం

సీలేరు: అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత నెల 8న కురిసిన వర్షాలకు పిల్లిగెడ్డ వంతెన పనులు జరుగుతుండగా వరద ప్రవాహం ఎక్కువై పొక్లెయినర్, రోలరు, ఇతరత్రా సామగ్రి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. వాటి కోసం 20 రోజులుగా గాలింపు చర్యలు చేపట్టగా గురువారం వాటి ఆచూకీ లభించడంతో వాటిని బయటకు తీశారు.

ప్రేమ వంచకుడి అరెస్టు

ఎస్.రాయవరం: పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ విభీషణరావు గురువారం తెలిపారు. నక్కపల్లి మండలం జి.జగన్నాథపురం గ్రామానికి చెందిన కొత్తూరునాగదేవ ఎస్.రాయవరం మండలానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పాతికిచ్చి.. పదోన్నతిపై వచ్చి?

- గృహనిర్మాణ శాఖ అడ్డగోలు పదోన్నతి
- ఈఈ స్థాయి ఉద్యోగికి ఉన్నతాధికారిగా పోస్టింగ్
- పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వ్యవహారంలో అతని అవినీతిపై విజిలెన్స్ విచారణ
- కూటమి ఎమ్మెల్యేలకు రూ.25లక్షలు ముడుపులు చెల్లించినట్లుగా ఆరోపణలు



సాక్షి, విశాఖపట్నం: కూటమి నేతల సిఫార్సులు.. దండిగా డబ్బులు ఉంటే చాలు.. అర్హత లేకున్నా అందలమెక్కవచ్చు. ఆరోపణలున్నా.. అవినీతిపై విచారణలు ఎదుర్కొంటున్నా.. అడ్డగోలు పదోన్నతులు పొందవచ్చు. ఎందుకంటే పాతిక లచ్చలు ఇచ్చారుగా మరి.! ఇటీవల జరిగిన బదిలీల్లో కూటమి ఎమ్మెల్యేలకు భారీగా ముడుపులు అందాయనడానికి ఇదో ఉదాహరణ. భారీగా ముడుపులిచ్చిన ఓ అధికారికి విశాఖలో గృహ నిర్మాణశాఖను ఏలేందుకు పెద్ద పోస్టే దక్కింది. అది కూడా పదోన్నతిపై. వాస్తవానికి ఆ పోస్టుకి ఆ ఉద్యోగి పూర్తిగా అనర్హుడు. తొలుత గృహ నిర్మాణ శాఖలో ఏఈగా చేరిన ఆయన తర్వాత డీఈగా బాధ్యతలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈఈగా పదోన్నతి వచ్చేసింది. ఇక కీలక కుర్చీలో కూర్చోవాలని బుద్ధి పుట్టిన ఆ అధికారికి.. బేరసారాలు కుదరడంతో ఎమ్మెల్యేలు జీహుజూర్ అన్నారు. దీంతో అనుకున్న కుర్చీ దక్కింది. ఎలాంటి అర్హత లేకపోయినా.. ఉన్నతాధికారిగా చెలామణి అవుతున్న ఆ అధికారి వ్యవహార శైలి ఇప్పుడు ఆ శాఖలో కాక పుట్టిస్తోంది.

అర్హత లేకున్నా.. కీలక పోస్టా?

వాస్తవానికి గృహ నిర్మాణ శాఖలో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్‌కే ఉన్నతాధికారి హోదాని అప్పగించాలి. కానీ జిల్లాలో పూర్తి విరుద్ధంగా వ్యవహరించారు. సదరు ఉద్యోగి డిప్లమో చేసి ఉద్యోగం సాధించారు. క్రమంగా ఏఈ నుంచి డీఈగా.. ఇప్పుడు ఈఈగా పదోన్నతి పొందారు. సిఫార్సులతో ఏకంగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్‌ఈ)గా బాధ్యతలు దక్కించుకున్నారు. ఈ క్రమంలో గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారిగా బదిలీపై ఇక్కడకు వచ్చేశారు. వాస్తవానికి డిప్లమోతో విధుల్లోకి చేరిన ఉద్యోగి ఉన్నతాధికారి పోస్టుకు పూర్తిగా అనర్హులు. కానీ అతనికి ప్రభుత్వం అధికారికంగా ఇన్‌చార్జి ఎస్‌ఈగా పదోన్నతి కల్పించేసి.. కీలక బాధ్యతలు కట్టబెట్టడం గమనార్హం. ఇందుకోసం కూటమి ఎమ్మెల్యేలకు ఏకంగా రూ.25 లక్షలు ముడుపులు చెల్లించుకున్నారని హౌసింగ్ డిపార్ట్‌మెంట్ గుసగుసలాడుకుంటోంది.

అవినీతి అధికారికి కీలక బాధ్యతలా?

సదరు అధికారిపై మొదటి నుంచి తీవ్ర అవినీతి ఆరోపణలున్నాయి. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వ్యవహారంలో అతను రూ.3 కోట్ల వరకు అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ విచారణ సాగుతోంది. డీఈ హోదాలో ఉన్నప్పుడే ఈ తతంగాన్ని నడిపించారు. అలాగే భీమిలిలో హౌసింగ్ విభాగంలో విధులు నిర్వర్తించిన సమయంలోనూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఇలా పనిచేసిన చోట్ల అవినీతి వ్యవహారాలు నడిపిన వ్యక్తికి.. ఇప్పుడు కీలక బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అభివృద్ధి పనులపై నివేదిక

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం ఆదేశం


సమావేశానికి హాజరైన అధికారులు

రంపచోడవరం: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నివేదికలు సమర్పించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం ఇంజనీర్లు, ఎంపీడీవోలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల్లో మారుమూల గ్రామాలకు సంబంధించిన లింక్ రోడ్లు, జన్‌మన్ పథకం ద్వారా పీవీటీజీలకు మంజూరైన గృహాలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. జన్‌మన్ పథకంలో విద్యుత్ మీటర్లు అమర్చిన గృహాల వివరాలను విద్యుత్‌శాఖ ఇంజనీరింగ్ అధికారుల నుంచి తెలుసుకున్నారు. అలాగే మారుమూల గ్రామాలకు లింక్ రోడ్ల నిర్మాణాల వివరాలపై ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. గిరిజనుల అవసరాలకు ఉపయోగపడే విధంగా భవనాలు నిర్మించాలని పీవో సూచించారు. స్పెషల్ మైనర్ ఇరిగేషన్ మరమ్మతులు చేపట్టాల్సిన చెక్‌డ్యామ్‌లపై పీవో ఆరా తీశారు. సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏజెన్సీలో కొత్త పనులకు ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.ప్రస్తుతం చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో డీఎన్‌వీ రమణ, ఈఈ శ్రీనివాసరావు, ఎంపీడీవో హరికృష్ణ, వీరకిషోర్, మడకం బాపన్నదొర, యాదగిరి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం పెంచుకోవడానికే కొత్త ఎక్సైజ్ పాలసీ

- మద్యం అమ్మకాల్లో 30 శాతం తగ్గుదల దిశగా పాలసీ ఉండాలి
- విక్రయాల్లో వ్యక్తిగత పరిమితిని ప్రవేశపెట్టాలి
- సీఎం చంద్రబాబుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ లేఖ

సాక్షి, విశాఖపట్నం: కేవలం ప్రభుత్వాదాయం పెంచుకోవడానికే అన్నట్టుగా కొత్త ఎక్సైజ్ పాలసీ రూపొందించారని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ వ్యాఖ్యానించారు. కొత్త మద్యం విధానంపై స్పందిస్తూ.. సీఎం చంద్రబాబుకు గురువారం ఆయన బహిరంగ లేఖ రాశారు. కొత్త పాలసీలో యువత, మహిళల సంక్షేమానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత కనిపించలేదని, కేవలం ఖజానాలో డబ్బులు నింపేలా మద్యం విధానాన్ని రూపొందించినట్టు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. టీడీపీ-జనసేన 2024 ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం యువత, మహిళా సంక్షేమానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత కొత్త విధానంలో కనిపించకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర సమాజ సంక్షేమ మంత్రిత్వ శాఖ 2018–19లో చేసిన సర్వే ప్రకారం.. మన రాష్ట్ర జనాభాలో 6 శాతం మంది మద్యానికి పూర్తిగా బానిసలుగా మారి వ్యాధుల బారిన పడ్డారని తేల్చిందన్నారు. జాతీయ స్థాయిలో అధికంగా మద్యపానానికి ప్రభావితమైన రాష్ట్రాల్లో ఏపీ నాలుగో స్థానంలో ఉందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఓ వైపు రాష్ట్ర ఆదాయం పెరిగినా.. మద్యం కారణంగా రాష్ట్రంలో లక్షలాది చిన్న కుటుంబాలు నష్టపోతాయని, దీనిపై దృష్టి సారించకపోవడం విచారకరమని వ్యాఖ్యానించారు. మద్యానికి బానిసలవడం వల్ల మహిళల మీద అత్యాచారాలు కూడా పెరుగుతున్నాయని, కుటుంబ ఆదాయం తగ్గి, పిల్లల చదువులకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. మద్యం అమ్మకాల్లో 30 శాతం తగ్గుదల దిశగా పాలసీ ఉండాలే తప్ప.. ఖజానా నింపేసుకునేందుకు కాదన్నారు. విక్రయాల్లోనూ వ్యక్తిగత పరిమితిని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కొత్త విధానంపై రాష్ట్రంలో మహిళా సంఘాలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని మద్యం పాలసీలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని శర్మ తన లేఖలో స్పష్టం చేశారు.

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సమగ్ర శిక్ష, అడిషినల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 26 నుంచి ఈ నెల 10వ వరకు apkgbv.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసే సమయంలో ఆన్‌లైన్‌లో పలు సమస్యలు తలెత్తుతున్నట్టు ఫిర్యాదులు రావడంతో అమరావతిలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్లు 70750 39990, 70751 59996లకు ఫోన్ చేస్తే సాంకేతిక సమస్యలు నివృత్తి చేస్తారని ఆమె సూచించారు. మరిన్ని సందేహాలకు జిల్లా కార్యాలయం ఫోన్ నంబర్ 99850 35247లో కూడా సంప్రదించవచ్చునన్నారు.

ఏచూరి పోరాటాలు మరువలేనివి


సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కూనవరం: అన్ని వర్గాల పేదల కోసం నిస్వార్థంగా పోరాడిన వ్యక్తి సీతారామ్ ఏచూరి అని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని టేకులబోరులో పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్ అధ్యక్షతన గురువారం సీతారాం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే వారే కమ్యూనిస్టులని అందులో సీతారాం ఏచూరి ముఖ్యుడని అన్నారు. పోలవరం సమస్య పరిష్కారం కోసం ఏచూరి మన్మోహన్‌సింగ్‌ను కలిసిన విషయాన్ని గుర్తు చేశారు.

సుమారు 20 సంవత్సరాల పాటు పోలవరం నిర్వాసితుల కోసం తనదైన శైలిలో పోరాట ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారన్నారు. ఏచూరి పోరాటాలు చిరస్మరణీయమన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం నేడు ప్రమాదంలో ఉందని, దేశంలో అన్నికులాలు, మతాలు ఐక్యంగా ఉంటేనే దేశం ఒకటిగా బలంగా ఏచూరి స్ఫూర్తితో జెమిలి ఎన్నికలను వ్యతిరేకించండి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా ఉన్న జెమిలి ఎన్నికలను వ్యతిరేకించాలని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని ఆయన కోరారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ ఏచూరి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

డిబ్రూఘడ్-హుబ్బళ్లి మధ్య స్పెషల్

తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా డిబ్రూఘడ్-హుబ్బళ్లి మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. డిబ్రూగడ్-హుబ్బళ్లి(05926) వన్‌వే స్పెషల్ ఈ నెల 5వ తేదీ (శనివారం) మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరి మూడో రోజు సోమవారం మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 3.10 గంటలకు బయల్దేరి నాల్గవ రోజు మంగళవారం ఉదయం 9 గంటలకు హుబ్బళ్లి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు 10-స్లీపర్ క్లాస్, 2-జనరల్ సెకండ్‌క్లాస్, 2-సెకండ్‌క్లాస్ కమ్ లగేజీ /దివ్యాంగ కోచ్‌లతో నడుస్తుంది.

మిజోరం గవర్నర్‌ను కలిసిన నాగార్జున


మిజోరం గవర్నర్‌తో నాగార్జున

బీచ్‌రోడ్డు: అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న మిజోరం గవర్నర్ కె.హరిబాబును సినీ నటుడు నాగార్జున గురువారం దసపల్లా హిల్స్ లోని ఆయన నివాసంలో కలిశారు. ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పలు విష యాలు చర్చించారు. ఆయన వెంట యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఉన్నారు. 10 రోజుల పాటు విశాఖ లో ఓ సినిమా షూటింగ్ ముగించుకుని గురువారం హైదరాబాద్ పయనమైన నాగార్జునను అభిమానులు కలిసి ఫొటోలు దిగారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


ఎస్‌ఐ గోపాలరావు

అరకులోయ రూరల్: జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు అరకులోయ మెయిన్ రోడ్డులో వాహనాలు తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టినట్టు అరకులోయ ఎస్‌ఐ జి.గోపాలరావు చెప్పారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో వాహనాల తనిఖీల్లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనచోదకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులకు అందరూ సహకరించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

- కాపాడిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్


మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

గోపాలపట్నం: ఆత్మహత్య చేసుకునేందుకు సింహాచలం రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఓ వివాహితను ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ కాపాడారు. వివరాలివీ.. రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం-1పై బుధవారం మధ్యాహ్న సమయంలో బుచ్చిరాజుపాలెం సుసర్ల కాలనీకి చెందిన కంచిమోజు అఖిల అనే వివాహిత అనుమానాస్పదంగా సంచరిస్తోంది. ఇది గమనించిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ కె.అనిత ఆమె వద్దకు చేరుకుని ప్రశ్నించారు. అనంతరం స్టేషన్‌కు తీసుకెళ్లగా.. ఏఎస్‌ఐ కె.ఆర్.కె.రావు ఆమె నుంచి వివరాలు సేకరించారు. కుటుంబ సమస్యల వల్ల ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చానని, తిరిగి ఇంటికి వెళ్లనని ఆమె తెలిపింది. దీంతో పోలీసులు ఆమె సోదరి కర్రి లీనాకు సమాచారం ఇచ్చారు. ఆమె సింహాచలం రైల్వే స్టేషన్‌కు వచ్చి ఆమెకు ధైర్యం చెప్పారు. మధ్యాహ్నం రెండు గంటలకు భర్త జగదీష్ సమక్షంలో ఆమెను సోదరి లీనాకు అప్పగించారు. సకాలంలో స్పందించి తన సోదరిని కాపాడిన పోలీసులకు లీనా కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న 230 ఆవుల పట్టివేత

బుచ్చెయ్యపేట: అక్రమంగా తరలిస్తున్న 230 ఆవులను బుచ్చెయ్యపేట పోలీసులు పట్టుకున్నారు. స్థానిక బీజేపీ నాయకులు సమాచారం మేరకు.. పాడేరు నుంచి నాలుగు వ్యాన్లలో తరలిస్తున్న ఆవులను వడ్డాదిలో ఎస్‌ఐ ఎ. శ్రీనివాసరావు తమ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. ఆవులు తరలింపునకు ఎటువంటి అనుమతి లేకపోవడంతో వాటిని బుచ్చెయ్యపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి పట్టుకున్న ఆవులను గోశాలకు పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిలకడగా జలాశయాల్లో నీటి మట్టాలు


వరద నీటితో కళకళలాడుతున్న డుడుమ జలాశయం


జోలాపుట్టు జలాశయం

- ప్రమాద స్థాయి నుంచి సాధారణ స్థాయికి నీటి నిల్వలు
- మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పాదనకు తీరిన నీటి సమస్య

ముంచంగిపుట్టు: ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే ప్రధాన డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో నీటి మట్టాలు సాధారణ స్థాయికి చేరుకున్నాయి. గత కొన్ని రోజులుగా సరిహద్దు గ్రామాల్లో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలకు భారీగా వరద నీరు జలశాయాల్లోకి వచ్చి చేరుతుండటంతో జలశాలయాల్లో నీటిమట్టాలు ప్రమాద స్థాయికి చేరుకున్నా విషయం తెలిసిందే. జలాశయాల అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించి నీటి స్థాయిని తగ్గిస్తూ వచ్చారు. డుడుమ జలాశయం నీటి మట్టం 2590 అడుగులు కాగా గురువారం నాటికి 2587.80 అడుగులుగా నమోదయింది. డుడుమ జలాశయ ఎగువన ఉన్న జోలాపుట్టు జలాశయ నీటి మట్టం సాధారణ స్థితికి వచ్చింది. జోలాపుట్టు జలాశయ నీటి సామర్థ్యం 2750 అడుగులు కాగా గురువారం నాటికి 2748.30 అడుగులు నీటి నిల్వ ఉంది.గత ఏడాది ఇదే రోజుకు 2733.70 అడుగులు నీటి నిల్వ ఉంది.గత ఏడాదితో పోలిస్తే 15అడుగులు నీటి నిల్వ ఎక్కువగా ఉంది. 223 క్యూసెక్కుల నీరు జోలాపుట్టు జలాశయంలోకి ఇన్‌ఫ్లో అవుతుంది.విద్యుత్ ఉత్పత్తికి ప్రధానంగా జోలాపుట్టు జలాశయ నీటి నిల్వపైనే ఆధారపడి ఉంటుంది. ఈ ఏడాది నీటి నిలువ స్థాయి మే నెల వరకు తక్కువగా ఉండడంతో ప్రాజెక్ట్ వర్గాలు సైతం ఆందోళన చెందుతు వచ్చారు.గత రెండు నెలలుగా ఆంధ్ర-ఒడిశా సరిహద్దు అంతా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కొండ, అడవి ప్రాంతం నుంచి భారీగా వరద నీరు జలాశయాలకు వచ్చి చేరుతుంది. దీంతో కొన్ని రోజుల వ్యవధిలో జోలాపుట్టు,డుడుమ జలాశయాలు నీటి స్థాయి ఊహించని విధంగా నీటి స్థాయి పెరిగింది. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీటి సమస్య నెలకొంటుందని ప్రాజెక్టు సిబ్బంది భావించిన తరుణంలో ఒక్కసారిగా నీటి స్థాయిలు పెరగడం మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పాదనకు నీటి సమస్య తీరినట్లయింది. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో 6 జనరేటర్లకు గాను 3 పనిచేస్తున్నాయి. వీటి ద్వారా 57 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. 1,2,5 జనరేటర్లు మరమ్మతులకు గురై వినియోగంలో లేవు. వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రాజెక్టు సిబ్బంది మరమ్మతులు చేపట్టి పనిలో నిమగ్నమై ఉన్నారు.

ఎట్టకేలకు కందిపప్పు పంపిణీ

- జిల్లాకు 230 టన్నుల కేటాయింపు
- 2,98,092 కుటుంబాలకు మేలు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు తెల్ల రేషన్‌కార్డుదారులకు ఈనెల నుంచి సబ్సిడీ కందిపప్పును అందుబాటులోకి తెచ్చింది. గత నెల 4వతేదీన కందిపప్పు లేన ట్టేనా.. శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై అధికార యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదించడంతో జిల్లాలకు 230 టన్నులు కేటాయింపు జరిగింది. దీంతో ఈ నెల నుంచి కందిపప్పు పంపిణీ ప్రారంభమైంది. దీనివల్ల జిల్లాలోని 22 మండలాల్లోని 671 రేషన్‌డిపోల పరిధిలో 2,98,092 రేషన్‌కార్డుల కుటుంబాలకు మేలు చేకూరింది. కిలో రూ.67 ధరకు రేషన్ కార్డు దారులకు పంపిణీ జరుగుతోంది. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి గణేష్ మాట్లాడుతూ రేషన్‌కార్డు దారులంతా సబ్సిడీ కందిపప్పును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటక పోటీలు ప్రారంభం


రాత నాటికలో ఓ దృశ్యం

అనకాపల్లి: కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని గౌరీ సేవా సంఘం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో ఈ పోటీలను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ప్రారంభించారు. ఈ నెల 7వ తేదీ వరకూ ఈ నాటికలు ప్రదర్శించనున్నారు.

రాత నాటిక...

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామం వేలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారి 'రాత నాటిక' ప్రదర్శన ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. మనిషికి కష్టం కలిగితే నా రాతింతే, నా రాత బాగోలేదు అంటూ ఉసూరుమంటాడు. సుఖం విషయంలో మాత్రం రాతను గాలికొదిలేస్తాడు. తాను పొందాల్సినవి మంచిగా పొందుతాడు. తాను తిరిగి ఇవ్వాల్సిన వాటి విషయంలో మాత్రం బాధ్యతా రహితంగా ఉంటాడు. అది ఎదుటి మనిషి విషయంలోనైనా, ప్రకృతి విషయంలోనైనా, ఇలాంటి మనిషి నైజం వల్ల ప్రస్తుత సమాజంలో ఎం జరుగుతోంది..? సమాజం ఎటుపోతోంది..? మనిషి జీవనం ఎలా సాగుతోంది..? ఈ అనర్థాలకు కారణం ఎవరూ...? ఇది ఎవరు రాసిన రాత...? అని ప్రస్తుత సమాజ పోకడలకు అద్దం పట్టేలా పాత్రధారులు ప్రదర్శించారు. స్వప్నిక. సురభివాగ్దేవి, గోవర్థన్, శ్రీనివాసరావు పోలుదాసు, కిరణ్, సురభి రాఘవ, అజయ్, పవన్ కల్యాణ్, బ్రహ్మ, బి.కొండలరావు నటించి తమ పాత్రలకు జీవం పోశారు. పోలుదాసు శ్రీనివాసరావు రచన, దర్శకత్వం వహించారు.

అజరామరం....నాటిక...

హైదరాబాద్ కళావర్షిణి వారిచే అజరామరం నాటిక నిర్వహించారు. పలువురిని ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నాటికకు రచనతోపాటు దర్శకత్వం జెట్టి హరిబాబు వహించారు. కార్యక్రమంలో కనకదుర్గ అమ్మవారి ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహానూకరాజు, ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రూ.100 కోసం హత్యాయత్నం


బ్లేడ్‌తో దాడి చేయడంతో గాయపడిన నూకిరెడ్డి శ్రీనివాస్


నిందితుడు బంగారి వెంకటరమణ

యలమంచిలి రూరల్: తన వద్ద అప్పుగా తీసుకున్న రూ.100ను తిరిగి అడిగినందుకు పదునైన బ్లేడ్‌తో దాడికి పాల్పడడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. యలమంచిలి మండలం కొత్తలి గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధితుడిచ్చిన ఫిర్యాదు మేరకు యలమంచిలి రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తలి గ్రామానికి చెందిన బంగారి వెంకటరమణ, నూకిరెడ్డి శ్రీనివాసు రోజువారీ కూలీలు. గతంలో బంగారి వెంకటరమణకు అవసరం మేరకు శ్రీనివాసు రూ.100 అప్పుగా ఇచ్చాడు. తానిచ్చిన రూ.100 తిరిగివ్వాలని శ్రీనివాస్ ఎన్నో సార్లు వెంకటరమణను అడిగాడు. బుధవారం కూడా వెంకటరమణను శ్రీనివాస్ డబ్బులు ఇవ్వాలని కోరాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కొద్దిసేపటి తర్వాత వెంకటరమణ సమీపంలో ఉన్న దుకాణం వద్ద కొత్త బ్లేడు కొనుగోలు చేశాడు. అనంతరం గ్రామంలో రామాలయం వద్ద కూర్చున్న శ్రీనివాసు దగ్గరికి వెళ్లి బ్లేడుతో విచక్షణారహితంగా దాడి చేశాడు. శ్రీనివాసు మెడ, తల, చేతులు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తస్రావం కావడంతో సొమ్మసిల్లిపోయిన బాధితుడ్ని 108 వాహనంలో యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడిచ్చిన ఫిర్యాదు మేరకు యలమంచిలి రూరల్ ఎస్‌ఐ ఉపేంద్ర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఎస్‌ఐ కొత్తలి గ్రామానికి వెళ్లి ఘటనపై ప్రత్యక్ష సాక్షులు, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. నిందితుడు వెంకటరమణపై ఇప్పటికే యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు కాగా.. ప్రస్తుతం ఆ కేసు కోర్టులో తుది దశకు చేరుకుంది. నిందితుడిని కొత్తలి రైల్వేగేటు వద్ద అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.